చిన్నకథ

పునర్జన్మ

"అలవాటు పడిన — ఆ సుఖం అంతగా అనిపించదు మనకు,
అది కరిగిపోతుంది, క్రమంగా చెరిగిపోతుంది,
నా బ్రతుకుమీద దండెత్తిన రకరకాల కష్ట పరంపర,
నామీద చల్లిన పన్నీటి తుంపర, మేదిపై భోగమయింది,
బ్రతుకులో భాగమ్మయింది, అనుభూతికి సులభమయింది,
దాదాపు సుఖమయింది."
—(ఉర్దూ మహాకవి మీర్జా గాలిబ్)

జీవితాన్ని కాచి వడబోసిన పై పంక్తులు తన స్మృతిపథంలో మాటి మాటికి విహరిస్తుంటాయి.

కష్టా లెప్పుడు ఉప్పెన వలెనే ఉవ్వెత్తుగా వస్తాయి. ఆదిలో వాటి ననుభవించే వ్యక్తికి విసుగు, విరక్తి, నిరాశ, నిస్పృహ కలగటం సహజమే. సాఫీగా, సుఖంగా జీవిత నౌక సాగితే ఎంత హాయి అనిపిస్తుంది హృదయానికి.

కష్టా లొచ్చిన సమయంలో అంతవరకు జ్ఞాపకం రాని ఆ "మాల దైవాన్ని" నిందిస్తాం. తనేం తక్కువ తిందా? తనెన్ని కష్టా లెదుర్కొంది. తానూ విధాతను నిందించింది.

శ్రీయుతులు
బి. ఎస్. రాఘవ, తిరుమలతాతాచార్లు

జీవితం మీద దండెత్తిన రకరకాల కష్టపరంపరల నుండి గట్టెక్కడానికి ఎంతో పోరాడింది తాను. పెళ్లి కాక ముందే కష్టాలు ప్రవాహంలా ముంచుకొచ్చాయి. తన రెండేళ్ల వైవాహిక జీవితంలో కాపురం చేసింది రెండు నెల్లు మాత్రమే తన గత జీవితాన్ని నెమరేసుకుంది శాంత.

"పదువారవ సంవత్సరంలోనే తనకు పెళ్లి చేశారు. తా నెంతో మురుక్కైనదని సహపాఠులు, ఉపాధ్యాయులు మురిసిపోయేవారు. పొరుగింటి పైన్ను మాస్టారు శేషాచలం, తన అన్న ప్రభాకరం ప్రాణ స్నేహితులు. తమింటికి, ఆయ వింటికి రాకపోకలు తరచుగా వుండేవి. అందుకే ఆయనంటే తన కంత చనువు. "శాంత అంటే శేషాచలం మాస్టారుకు ప్రత్యేక అభిమానంలోయ్" అని సహపాఠులు అనటం తనంత త్వరలోనే మరువగలదా? అతనికి, తనకు ఎన్ని కల్లి బొల్లి సంబంధ లంటగట్టారో! ఈ కాలం కుర్రవాళ్ల కది సహజం. ఏం తాను శేషాచలం గారితో చనువుగా తిరిగితే ఈ లోకాని కెందుకు? అప్పుడే నాన్నగారు తన కా మూడు ముళ్లు వేయించారు.

"ఏమే శాంతా! దాశైనా వ్రాయకుండ హడావుడిగా దిగావ్!" అని అంది తన తల్లి.

స్నేహితురాలు కమల తన్ను గుచ్చి గుచ్చి ప్రశ్నించింది. తాను ముభావంగా వుండడంతో "ఏమోనమ్మా" అని మూతి విరిచింది ఆ పిచ్చి పిల్ల. ఈ నైన కన్యలు క్రమంగా లావౌతారని, పెళ్లయి కాపురాని కొచ్చేక పలుచబడతారని ప్రతీతి. శరీరాల కేదో మరుకుదనం, కళ్లకు కాంతి కలుగుతాయ్యుట ఆ దశలో! అదే యదార్థమైతే, తా వా నోము నోచుకోలేదు.

"ఏమే, అమ్మాయి ఎపు డేదో ఆలోచిస్తూంటుంది!" అని అనేవారు నాన్న అమ్మతో.

తన కానందం కలిగించటానికి ఎంతో ప్రయత్నించాడు ప్రభాకర్. సంతోషం హృదయం నుండి పెల్లుబకాలి గాని, నవ్వుమోము పెట్టేస్తుందా? పిల్ల పిచ్చిగాని, హృదయంలో దావానలం దాచుకుంది తాను.

అత్త మామలు మంచివారై, ఆడుబిడ్డలు కలుపుగోలుపుగా తిరుగుతూ, భర్త తన కనుకూలు డైతే ఆడదాని కంతకన్న స్వర్గమేముంది? అది ఎన్ని నోముల పంటో.

"ఇల్లు నరక మన్నాడు" ప్రభాకర్. ఎవరి కష్ట సుఖాల కెవరు బాధ్యులు? ఆదర్శయుత ప్రపంచాన్ని భావించుకుంటాం. విమర్శించి చూస్తే లోకంలో అన్ని పరస్పర విరుద్ధాలే. అంతా కర్మ, అంతా మిథ్య అని అంటాం. తన కాత్మహత్య చేసుకోవా లనిపిస్తుంది. మృత్యుముఖం తలచుకొంటేనే భయం, ప్రాణంపైని తీపి అలాంటిది. బ్రతుకేమో దుర్భరం, అందరికీ ఎన్నో తీయని కోర్కె లుంటాయి. ఆ కోర్కెలు భావకవి కవిత్వంలాగా స్మృతిపథంలో విహరిస్తుంటాయి. నిత్య జీవితంలో అవన్నీ ఎండమావులు. ఆ కోర్కెలు ఫలించవేదని మనసు పాడుచేసుకోవటం వట్టి భ్రాంతి. మరచిపోవటం ఉత్తమం. అంత సులభంగా మరచిపోగలుగుతామా? అవును. మరువలేము. ఆ మరపురాని మనో వేదనలు జీవితాంతం క్షోభపెడ్తాయి.

"నా ఈ బాధలకు మీ రెందుకు బాధపడ్తారు." అని అంది తాను తలి దండ్రులతో నిజంగా, అదే బాధ అయితే దానికి దూరంగా వుండడానికి ప్రయత్నించండి. అందులోనే వుంది ఆనందం. అందులోనే వుంది వెలుగు. అందులోనే వుంది జీవిత సర్వస్వం.

ఒకనాడు ప్రభాకర్ గదిలో తలుపులు వేసుకొని దీర్ఘంగా ఆలోచించి, ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది. తన అత్తవారిల్లు జ్ఞాపకమొచ్చి.

ఈ రెండేళ్ల వైవాహిక జీవితంలో తాను భర్తతో కాపురం వెలిగించింది రెండు నెలలు మాత్రమే. "శాంతా" అని అప్యాయంగా పారె గదిలో తన భర్త సరససల్లాపా లాడటం ఇంకా చెవుల్లో గింగురు మంటుంది! తన అత్తగారిలో స్వతం-డబ్బు, దర్పం-ఇవే మానవుని బానిసను చేస్తున్నాయి. తన్నునాన్నగారా ఇంటి కివ్వడంలో ఉద్దేశ్యం? ఐశ్వర్యంతో తులతూగే ఆ ఇంట్లో అత్తగారి పెత్తనం. ఆడదాని కధికార మిస్తే-శాంతి, సుఖ, సౌభాగ్యాలు నిండుకుంటాయని అంటారు. "స్త్రీ బుద్ధి ప్రళయాంతకః" అని వూరికే అన్నారా? ఇద్దరు ఆడపడచులు, ఇల్లరికపు అల్లుళ్లు-ఆ ఇంటి బలగం, మరిది బి. ఏ. చదువుతున్నాడు. తన భర్త గిరి లెక్చరర్ సాగించే కాలేజీలోనే, మామగా రో మునిసి తొక్కు. ఎంత ఐశ్వర్య ముంటే నేం? తన్ను బానిసలా కొని వేశారు. వంట చాకిరీ, ఇంటి చాకిరీ, ఒకటేమిటి! సమస్తం తానే చేయాలి. భోజనం చేస్తే కంచాలు కూడా కడగ రా ఇంటి దొరసానులు. ఆ చాకిరీ చేయటానికే తా నా ఇంటి కోడలు.

"శేషాచలం మాస్టారట వచ్చారే అమ్మాయ్! శాంతా!" అని అత్తగారి కంఠస్వరం చెవిన బడ్డంతో ఉలిక్కిపడింది తాను.

"ఏం శాంతా! ఇలా చిక్కిపోయావ్!" అన్న మాస్టారు ప్రశ్నకు తన సమాధానం ముభావం మాత్రమే. తనకు పరిస్థితు లర్థమయ్యాయా ఆయన ముఖకవళికలే చెప్పక చెప్పాయి.

"ఇదో సత్రం, అడ్డదిడ్డం మనుషు లెపుడూ వస్తూంటారయ్యా!" అని అత్తగారు. లేనిపోని అనుమానాలు పాటుమరించా రా ఇంట్లో.

"అన్నయ్యా! మీ ఆవిడకి మేల్ ఫ్రెండ్స్ చాలామంది వున్నారు. ఎందుకైనా మంచిది కాస్త జాగ్రత!" అని నవ్వుతూ విషబీజాల్ని వెదజల్లింది తన చిన్న ఆడబిడ్డ.

* * * *

"ఏమండీ! ఏదో ఆలోచిస్తున్నారు?"

"అండీ! అట అండీ!"

"అనవసరంగా అనుమానా లెందుకండీ!"

"అనుమానా లెందుకు, ప్రత్యాక్షానుభవాలే!" అని ఒక వికటపు నవ్వు నవ్వారు తన భర్త.

ఆ రాత్రి తనకు నిద్ర పట్టలేదు. ఎలా పట్టుంది? లేనిపోని అభాండాలతో, అపార్థాలతో, అనుమానాలతో తన్ను పతితగా పరిగణించి లోకం నవ్వుతూంది. ఆడదాన్ని భర్తే అనుమానిస్తే, స్త్రీకి సంఘంలో ఇంకెక్కడి స్థానం! తన్నధఃపాతాళాని కణగద్రొక్క ప్రయత్నిస్తోంది సంఘం.

దీనికి తోడు పులిమీద పుట్రలా కడుపు నొప్పి ప్రారంభమయింది తనకు. ఆ మిషతో పుట్టింటికి పంపేశా రత్తగారు. తనప్పుడు నిరాకృత శకుంతల.

హృదయం బరువు తీరటానికి తన ఆవేదన నన్నయ్యకు వెళ్లబోసింది. అన్నయ్యే తన జీవితానికి రూపు, రేఖా దిద్దవలసిన వ్యక్తి. తనకే లోకంలో అన్నయ్యే అప్పుడు. తన కడుపు నొప్పి పోగొట్టటానికి ఆయ నెంత కష్టపడ్డాడు. తన భర్త రాకను నిరీక్షిస్తూ కళ్లల్లో వత్తులు పెట్టుకుంది!

అపుడే రెండేళ్లు గడచిపోయాయి.

"వెధవ సంబంధం" అని అన్నయ్య అన్న మాట బల్లెంలా హృదయంలో నాటుకుంది. పందొమ్మిదవ సంవత్సరంలోనే తన జీవితపు మొదటి అధ్యాయం ముగిసిపోయింది. సంఘం తన జీవిత నాటకానికే మంగళ గీతం పాడబోతుంది.

"లేదు, పిడ్డానికి వేళ్లేదు." అంది అంతరాత్మ.

నిజంగా భర్త అంటే తనకంత అనురాగమా? తన వెర్రిగాని, భర్త అంటే అనురాగం లేకేం? భర్తకు తనపై అనురాగం లేదా? ఏమో! తా నా ఇంటికి దాసి. తన్నును భరించాడు. అనుమానించాడు. తిట్టాడు. కొట్టాడు. తాను సహించింది. సహనమే ఇంత పని చేసింది. సహనం లేకపోతే ప్రేమించేవాడా? అసలు సహనానికి, అనురాగానికి పొత్తేమిటి? ప్రేమించుకుంటే, బాధలు నోర్చుకోలేము? తాను తన భర్తతో అనురాగపు మాటలు మాట్లాడినట్టే తనకు జ్ఞాపకంరావట అయితే, తనకు భర్త అంటే ప్రేమ లేదంటారా? ఇంతకు తన భర్త తన్ను ప్రేమించాడా? అన్నదే ప్రశ్న. తన ప్రేమ బూడిదలోపోసిన పన్నీరు. అయినా, ఆ పన్నీటి తుంపరలనే తన హృదయంలో పదిలపరుచుకుంది. అవే తన బ్రతుకులో భాగమయ్యాయి, అనుభూతికి సులభమయ్యాయి.

ఈ ఆత్మ పరిశోధనలో ప్రపంచాన్నే మరచిపోయింది తాను. కన్నీళ్లింకిపోయినై. ఆలోచనలు రావటం మానినై. కునుకు తీసిందో లేదో, చల్లని చేయి, "శాంతా" అన్న మధుర కంఠం తాను విన్నది.

ఆ పిలుపుతో అణగారిన ఆవేదన పున్నమ చంద్రుని చూచిన సముద్రంలా పొంగిపోయినది.

"అన్నయ్యా" అని ప్రభాకర్ ఒడిలో తల దూర్చి చిన్న పాపాయిలా ఏడ్చింది. తన ప్రేమను పంచుకోగలిగింది అతనొక్కడే. తన గతిని చూచేదా ఎకోదరుడే. అన్నయ్య హృదయం ద్రవించింది.

"ఔను, నీకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం చేసేదాకా ఈ అన్నయ్య నిద్రపోడు. నాకు నైతిక బల ముంది. మీవాళ్ళు మానవులా? నర రూప రాక్షసులా? నిజా నిజాలు తెలుసుకోలేని పరమ మూర్ఖుడు నీ భర్త. ఇంగిత జ్ఞానం లేని పశువు. చదువూ, సంధ్యా, సంస్కారం జీర్ణించుకున్న కాలేజి లెక్చరర్ ఇలా ప్రవర్తిస్తే వాడికింద తరిఫీదయిన విద్యార్థు లెంత సత్పౌరు లౌతారు? ఎందుకు వాడికి ఎం. ఎస్. సి! కాల్చనా! పేల్చనా! అంతరాత్మ కగ్ని సంస్కారం జరిపించిన మహానుభావుడు. న్యాయా న్యాయ విచక్షణ తెలియని ఒక వింత మృగం నీ భర్త."

"ఇంకా ఎందుకురా దానికి చదువు" అని అంటున్న తన తలితండ్రులను "మీకు సంబంధించిన విషయం కాదని" మందలించి తన్ను బి. ఎస్‌సి. లో చేర్పించిన అమృత హృదయుడు అన్నయ్య.

బి. ఎస్‌సి. ఫస్ట్ క్లాస్‌లో పాసయేనాటికి తన అన్నయ్యకు మూడు పదులు దాటాయి. చలంగారు తన భావి జీవితానికి పునాది వేసిన అన్నగారిని "థేంక్స్"అని కౌగలించుకున్నారు.

తాను గర్ల్స్ హైస్కూలులో ట్రయిన్డ్ సైన్సు అసిస్టెంటుగా చేరి రెండేళ్ళయింది. తన జీవితాంతం ఆ వృత్తికే అంటిపెట్టుకోవాలని తన అభిలాష.

తానో ఆదర్శ అధ్యాపకురాలని వూరూరా వాడా అనుకోవాలని తన అభిమతం. నేటికి కదా తనకు పునర్జన్మ లభించింది.

"ఏమిటి, శాంతా, అంత దీర్ఘాలోచన....." అంది ఇంగ్లీషు టీచరు మేరీ జయప్రద.

"ఏబ్బే ఏమీ లేదు..,...." అన్న శాంత సమాధానం రెండో పీరియడ్ బెల్ మోతలో వినబడలేదు.

నోట్ బుక్స్, టెక్స్ బుక్ తీసుకొని ఫిఫ్త్ ఫారమ్ గది వైపు వేగంగా నడిచింది శాంత.





ప్రస్తుతం మద్రాసులో వున్న కంపెనీ లా కమిషన్ అధ్యక్షుడు శ్రీ తెన్నేటి విశ్వనాధంగారు గత బుధవారం నాడు ఆంధ్ర వాణిజ్యమండలి కార్యాలయాన్ని సందర్శించి, మండలి సభ్యులతో చర్చలు జరిపారు

రాల్లరగించిన రాగోపాసకుడు

శ్రీ సంగమేశ్వరశాస్త్రి

శ్రీ మండపాక రాజేశ్వరశాస్త్రి

విశ్వకవి రవీంద్రనాథ ఠాగూరు గారితో శ్రీ సంగమేశ్వర శాస్త్రిగారి సమావేశం వర్ణిస్తూ, ఆంధ్రప్రభ(20-4-58)లో ప్రచురించిన నా వ్యాసం చదివి, మిత్రు లనేకులు నా పూర్తి అనుభవాలు వ్రాయమని కోరినందువల్ల మిగిలినవి ఈ వ్యాసంలో వ్రాస్తున్నాను.

శ్రీ రవీంద్రనాథ ఠాకూరు గారికి వీణంటే ఎంత అభిమానమో, ఎంత పూజ్య భావమో చూడండి. వీణను శరీరంగాను, వీణా తంత్రులు హృదయ తంత్రులుగాను, వీణా వాద్యం హృదయము నుంచి వచ్చిన పాటగాను, వాదకుడు భగవంతుడే అని వారు తరచు తమ గేయాలలో ఉదహరిస్తూ వుండేవారు. తమ సంభాషణలలోనూ ఈ విషయమే వారు చెబుతూ వుండేవారు. ఒకనాటి రాత్రి వాద్యానంతరం శలవు తీసుకుందికి వారి సమీపానికి శ్రీ సంగమేశ్వర శాస్త్రిగారు లేచి వెళ్లారు. ఠాకూరు గారు చిరునవ్వు నవ్వుతూ, తమ చేతి వ్రేళ్ల చూపించి ఆసక్తితో అడిగారు : "ఇప్పుడీ వయస్సులో నేర్చుకొంటే నాకు వీణ వాయించడం వస్తుందా?"

ఇంగ్లీషులో వా రడిగిన ఈ ప్రశ్న తెలుగులో శాస్త్రిగారికి చెప్పగా, వారు ఠాకూరు గారికి ఇలా జవాబు చెప్పమని నన్ను కోరినారు. "తమవంటి కళా పిపాసులకి రస పుష్టితో నిండిన చక్కని సంగీత మందివ్వడమే మావంటి వాళ్లం నిత్యం చేసే కృషికి సార్థకం. వీణా సాధన శ్రమతో కూడిన పని. మావంటి వాళ్లం తమ అండవిడలో ఉన్నంత కాలం తమ కా శ్రమ ఎందుకు?"

"అవును" అన్నారు ఠాకూరు గారు. "ఈ వయస్సులో నా కిప్పుడు సంగీతం నేర్చుకొనడం కష్టమే." అప్పుడు వారు అక్కడున్న అందరి వేపూ తిరిగి అన్నారు : "మీ రందరూ తప్పకుండా వీణ నేర్చుకోండి. అది మీకు కష్టమైతే మీ పిల్లలకు నేర్పించి వాళ్ళు వీణ వాయిస్తూ వుంటే విని ఆనందించండి. అదీ కష్టమైతే వీణను ఇంట్లో పెట్టుకొని నిత్యమూ నమస్కారం చేస్తూ తరించండి."

ఆ రోజులలోనే, అప్పుడు బెంగాలు గవర్నరుగా ఉండిన లార్డు రొనాల్డ్షే శాంతినికేతన్ సందర్శించారు. (1919) ఇలాగు ఎందరో విదేశీయులూ అప్పు డప్పు డక్కడికి వస్తూనే వుండేవారు. గవర్నరు గారి రాక సందర్భంలో ఏర్పాటైన కార్యక్రమాలలో ముఖ్యమైనది శ్రీ సంగమేశ్వర శాస్త్రిగారి వీణాగానం. ఠాకూరుగారు శాస్త్రిగారి నీ వారి వీణనూ గవర్నరుగారికి పరిచయం చేస్తూ ఇలా అన్నారు :

"This is our Vena. He is own Master"

"గవర్నరుగారు సుమారు గంటసేపు వీణ కుతూహలంగా విని, వారి ఎ. డి. కాంగు ద్వారా కబురు పంపించారు. ఏ. డి. సి నాతో ఇంగ్లీషులో అన్నాడు :

Please tell your master that His Excellency is very much pleased. The music is simply wonderful.

ఈ కలాపాసకు లిద్దరికీ జరిగిన చారిత్రాత్మకమైన ప్రథమ సమావేశమే ఒక చిత్రమైన సంఘటన. 1919 మొదటి మాసాలలో రవీంద్రనాథ ఠాకూరుగారు అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని దక్షిణ ప్రాంతాలలో పర్యటిస్తూ ఉపన్యాసా లిస్తూ వుండేవారు. వారికి వీణంటే ఎంత ఇష్టమో గాని వారు సందర్శించిన స్థలాలన్నిటిలోనూ వైణికులను రావించి వారి వాద్యం వింటూ వుండేవారు. ఠాకూరుగారు ఏప్రిల్ నెలలో మద్రాసు వచ్చి, వారి శిష్యులైన శ్రీ పిఠాపురం రాజా వారి పేర ఇలా ఉత్తరం వ్రాశారు :

"మీ సంస్థానంలోగాని, మీ ప్రాంతంలోగాని వైణికు లెవరేనా వుంటే నేను పిఠాపురం వచ్చేసరికి సిద్ధంగా వుంచండి. వారి వాద్యం వినడానికి నాకు కుతూహలంగా ఉంది." దీనికి శ్రీ రాజావా రిలా జవాబు వ్రాశారు: "అలాగే తప్పకుండా చేస్తాను. మా సంస్థానంలోనే ఒక వైణికు డున్నాడు. తమరు ఓపిక తో మూడు గంటల కాలం కూర్చో గలిగితే, తప్పకుండా మా సంస్థాన వైణికుడి వాద్యం వినవచ్చును." (ఈ మాటలు ఠాకూరుగారే స్వయంగా నాతో ఇంగ్లీషులో శలవిస్తూ ఇది కూడా అన్నారు: "శ్రీ రాజావారికి సంగీతంలో అంతంతమాత్రమే పరిచయ ముందనుకుంటాను. లేకపోతే, ఇట్టి మహా వైణికుడు తన సంస్థానంలోనే వున్నాడని గర్వించవలసి వుండగా, ఆయన 'నేను మూడు గంటల కాలం కూర్చో గలిగితే' అంటూ వ్రాస్తారా?" ఠాకూరుగారు శ్రీ రాజావారికి జవాబు వ్రాస్తూ "తప్పకుండా వైణికుడిని ఏర్పాటు చెయ్యండి. నాకు వీణంటే మహా ఇష్టం. నేను మూడు గంటలే కాదు, ముప్పయి గంటలేనా విసుగు లేకుండా కూర్చోగలను" అన్నారు.

అనుకున్న ప్రకారం శ్రీ ఠాకూరుగారు పిఠాపురం రానూ వచ్చారు. శ్రీ సంగమేశ్వర శాస్త్రిగారి వీణా వాద్యమూ ఏర్పాటైంది. ఏమంగా సాయంత్రం మూడు గంటలకు ఠాకూరుగారి బసలో వీణా గానం ప్రారంభమైంది. శ్రీ రాజావారూ, శ్రీ ఠాకూరుగారూ, మరి కొందరు పెద్దలు సభలో కూర్చొనివున్నారు. (ఈ సంగతులు శ్రీ శాస్త్రిగారే నాతో స్వయంగా చెప్పారు.) శాస్త్రిగారు ఇదివరకు నలిగిన రస్తాగానే 'వాతాపి' తో వాద్యం ప్రారంభించి, తగుమాత్రం రాగం స్ఫురింపజేస్తూ మరి రెండు మూడు కీర్తనలు వాయించి, పల్లవి వాయించే ఉద్దేశంతో కాంభోజిరాగం ఎత్తుకున్నారట.

నాతోటి పాతవాళ్లందరికీ శ్రీ శాస్త్రిగారి వాద్యం పద్ధతి అనుభవమే. మొట్టమొదట వారు వీణ మీద స్థాపించిన తమ ఇష్టదేవతా రూపాలకు మొక్కి కళ్ల నద్దుకుంటారు, స్పర్శిస్తారు. తరువాత వీణ శ్రుతులు సరిచేస్తూ, శ్రోతల నందరినీ ఒక్కసారి చూస్తారు. అంతే. ఆ ఒక్క చూపులోనూ సభలో వున్న యావన్మంది తాలూకు సమష్టి రసాస్వాదన జ్ఞానం ఆయనకు తెలిసిపోతుంది. ఆయన వీణకు నమస్కారం చేస్తూ ఎత్తుతారు. (ఆయన వీణ నిలబెట్టే వాయించేవారు) వీణ వాయిస్తున్నంతసేపూ వారి విగ్రహం ఏమాత్రం చలనం లేకుండా వుంటుంది. నేత్రాలు అర్ధ నిమీలితంగా వుంటవి. వీణ తంతిలో అపస్వరం వస్తే తెలిసినట్లే, తన వాద్యం శ్రోతలకు నచ్చినదీ లేనిదీ వారిని చూడకుండానే ఆయనకి తెలిసిపోతుంది. తంతి సరిచేసుకున్నట్లే ఆయన తన వాద్యము శ్రోతల హృదయాల కనుగుణ్యంగా సరిదిద్దుకొని వాయించుకు పోతారు.

సరిగా ఠాకూరుగారి సమక్షంలోనూ ఇంతే జరిగింది. ఠాకూరుగారు సేతు పిఠాపుర పర్యంతమూ వింటూ విసిగివున్న బాణీలోనే ఈ యన నా వీణ వాయించుకుపోతున్నాడు. ఠాకూర్గారి ముఖంలో ఏ రసానుభూతీ కనబడలేదు. వా రన్య మనస్కులై పూరక శాస్త్రిగారి వేపు చూస్తూ కూర్చున్నారు.

శాస్త్రిగారికి తెలిసిపోయింది, (శాస్త్రిగారే నాతో అన్నారు) తను వాయించే పద్ధతి ముఖ్య శ్రోతకు నచ్చలేదని! ఆయన రెండు విసురులతో చప్పున కాంభోజి రాగం పూర్తిచేసి, తక్షణం కమాచ్‌రాగం (అవే స్వరాలు) ఎత్తుకున్నారు. రుద్రవీణ ఫకీర్లో (వరిక) రెండు మూడు సంగతులు శాస్త్రిగారు వాయించేసరికి మబ్బులలోంచి బైటపడ్డ పున్నమ చంద్రబింబంలాగు ఠాకూరుగారి మోము విప్పారి ఆనందంతో తొణికిసలాడింది. అంతకంతకూ ఆవేశం ఎక్కువైంది. అవశంగా ఆయన శరీరం నాగస్వరం పాటకు నాగుబాము మూగినట్టు వూగిసలాడింది! పుష్పాంజలితో దైవ సన్నిధిని కూర్చొని ధ్యాన నిమగ్నుడైన యోగిలాగు ఆయన దోసిలి పట్టి అంతవరకూ అలాగే కూర్చున్నారు. శాస్త్రిగా రేమి వాయిస్తున్నారో శాస్త్రిగారికే జ్ఞాపకం లేదట! కాలం గడిచిపోతున్నా ఎవ్వరికీ ఆ చైతన్యమే లేదు. రాత్రి ఎనిమిది గంట లైంది. అప్పటికి శాస్త్రిగారికి కాస్త అనుమానంవేసి అడిగించారట. "ఇంకా వాయించమన్నారా, ఆపివెయ్యమన్నారా" అని. అంతవరకూ ధ్యానంలో కూర్చున్నట్టున్న ఠాకూరుగారు చప్పున చైతన్యంలో పడి, అన్నారు : "ఈ అమృత వాహినిలో మునుగుతూ తేలుతూ ఇలాగే రాత్రంతా కూర్చోమంటే కూర్చోవాలనే వుంది. కాని వారికి ఆయాసం వినట్టుంది. ఆపివెయ్యమనండి. వారికి నా హృదయపూర్వకమైన ధన్యవాదాలు."

ఆ మర్నాడు శ్రీ రాజావారు ఇతర విద్వాంసుల చేత ఏంగేజిమెం టిప్పిస్తామని చెప్పగా ఠాకూరుగారు "అలాగే వింటాను గాని, శాస్త్రిగారి వీణ మాత్రం మరవకండి" అని చెప్పారట. మర్నాడు ఇతర వాద్యాలన్నీ ఆరంభదశలోనే ఆపించివేసి, శాస్త్రిగారి వీణ మళ్లీ ఐదు గంటల కాలం ఆనందంగా విన్నారట! అప్పుడే ఠాకూరు గారు సంగమేశ్వర శాస్త్రిగారిని శాంతి నికేతనానికి ఆహ్వానిస్తూ, వారిని తప్పకుండా పంపవలసిందిగా శ్రీ రాజావారిని కోరారు.

మేము శాంతినికేతనంలో ఉన్న రోజులలో ఒకనాటి రాత్రి శ్రీ శాస్త్రిగారూ, వారితో పండిట్ భీమారావు శాస్త్రిగారూ, నేనూ ఇతరులమూ కళామందిర్ మెట్లెక్కి మేడమీది హాలులోకి వెళ్లేసరికి ఠాకూరుగారు హాలులో ఒక ప్రక్కగా కుషను చెయిరుపై ఆసీనులై వున్నారు. వారి ప్రక్కనే పైసా మంచి ('లీనింగ్ టవరాఫ్ పైసా' ప్రసిద్ధి) వచ్చిన ఒక ఫ్రెంచి ప్రొసరూ, వారి శ్రీమతీ కుషను చెయిర్లపై కూర్చొని వున్నారు. సమీపంలో తివాసీల మీద ఏభై అరవై మంది పురుషులూ, కించిద్దూరంలో కొందరు స్త్రీలూ ఆసీనులై వున్నారు. మా నమస్కారా లందుకుంటూ ఠాకూరుగారు "వీరు చాలా దూరంనుంచి మన ఆశ్రమం (బ్రహ్మచర్యాశ్రమం, శాంతినికేతన్) చూడడానికి వచ్చారు. మీ ప్రతిభ వీరికి చెప్పి, మీ వీణా వాద్యం వినడానికి ప్రత్యేకంగా వీరి నిక్కడ వుంచివేశాను" అని మాతో అంటూ, ప్రొఫెసరు గారితో శాస్త్రిగారిని గురించి ప్రశంసా వాక్యాలు పలికేరు.

యథాప్రకారంగా శాస్త్రిగారు వీణా వాద్యం ప్రారంభించి చకచక వాయించుకు పోతున్నారు. పైసా ప్రొఫెసరూ, ఆయన సతీమణీ కుర్చీల మీద ముందుకు వంగి కూర్చుంటూ ఆత్యాశ్చర్యంతో వింటున్నారు. ఇంత స్వచ్ఛమైన చక్కని నినాదం (ప్యూర్‌నోట్స్) ఆ వేళ్లలో ఎలా పలికిస్తున్నారా అని ఆయనకి తెలియక, దిగ్భ్రమ కలిగింది. ఈ దేశంలో ఇంత 'వండర్‌ఫుల్ మ్యూజిక్' ఉందా అన్నా డాయన. ఇటువంటి ప్యూర్ స్వీట్ నోట్సు పలికించగలిగిన ఇన్స్ట్రుమెంటు ఇండియాలో ఉందని తమ దేశంలో ఎవ్వరికీ తెలియదని ఆయన అన్నాడు. ఆయన భార్య ఆశ్చర్యపడడం మరొక దానికి. ఆమె పియానో వాయించడంలో డిగ్రీలు పొందివున్న వ్యక్తి. ఈ ఇండియన్ ఆర్టిస్టు ఇంత గ్రంథనూ, స్క్రిప్టూ చూడకుండా, అంతా ఎలాగు జ్ఞాపకం పెట్టుకు వాయించ గలుగుతున్నాడా అని! నిముష నిముషానికీ శాస్త్రిగారి వాద్యం వారి మన్నన అందుకున్నది. అరగంట తరువాత బహుశా ఈ పాశ్చాత్యుల మన్ననలవు వాళ్ల సంగీతమే వాయించి — ఇంకా పొందవచ్చునని కాబోలు, శాస్త్రిగారు వివిధ గతులలో, చిత్ర విచిత్రమైన మీటు సొగసులు చూపిస్తూ బ్యాండ్ ట్యూన్లు ప్రారంభించేసరికి ఠాకూరుగారు ఫకాలున నవ్వుతూ, ప్రొఫెసరు గారి వేపు తిరిగి, "మిమ్మల్ని ప్లీజ్ చెయ్యడానికి ఇవి వాయిస్తున్నాడు" అన్నారు. "ఆయనిప్పుడు 'స్కాటిష్ బ్యాగ్ పైప్ ట్యూన్సు' వాయిస్తున్నారు" అన్నారు ప్రొఫెసరుగారు చిరునవ్వుతో. "ఇందాక వాయించిన సంగీతం ఎంతో 'హార్టు మెల్టింగ్' గా వుంది. నిండు మనసుతో అంటున్నాను."

వీరి సంభాషణ జాగ్రత్తగా వింటున్న నేను శాస్త్రిగారితో ఈ మాటలు తెలుగులో చెప్పేసరికి ఆయన చిరునవ్వు నవ్వేసి, ఉత్తర క్షణంలో (కేదారగౌళ ఎత్తుకొని హిందూస్తానీలో దేశ్) అద్భుతంగా ప్రస్తరించి, అప్పటి కప్పుడు ఒక గత్తు కల్పన చేసి, త్రికాలములలోనూ కల్పన వాయించి, విరామంగా కొద్ది క్షణాలు వీణ వాయించడం ఆపినారు.

ఈ సందు చూసుకొని ప్రొఫెసరు ఠాకూరుగారితో "మీ రొకమారు పాడితే వినాలని వుంది. మీ గేయాలను గురించి మా దేశంలో ఎంతో చెప్పుకుంటాం" అని బ్రతిమాలుతూ అన్నారు. వారి సతీమణి శ్రుతి కలుపుతూ, "ఎంతో ఆశపడి వచ్చాం మా రిక్వెస్టు మన్నించండి" అంటూ ప్రాదేయపడ్డారు.

"నేను పాడి చాలా కాలమైంది. అంతా మరిచిపోయాను. నా వంతు గేయాలు వ్రాయడమూ — తక్షణం మరిచిపోవడమూ. ఇదుగో, నా పాటలకి 'వాకింగ్ డిక్షనరీ' దినేంద్ర" (దినేంద్రనాథ ఠాకూర్, విశ్వకవి అన్నగారి కుమారుడు. అతడికి టాకూరు గారు చేసిన గేయాలన్నీ కంఠస్థం వచ్చును!) ప్రొఫెసరు దంపతులు వదలలేదు. ఠాకూరుగారిని నిర్బంధిస్తూ, ఎలాగేనా ఒక్క పాటేనాసరి పాడమని మరీ మరీ ప్రార్థించారు.

ఠాకూరు గారు అనుమానంగా అందరి వేపు చూస్తూ, ఎట్టకేలకు గొంతుక సవరించుకొని పాడడం ఆరంభించారు.

ఏమి పాట అది! ముతక తీగె కట్టిన వీణా నాదం లాగే వుంది వారి శారీరం. గౌళ గాత్రంలో పాడుతున్న స్త్రీ కంఠంలాగే వుంది వారి కంఠం. వారి పాట పాటే కాదు. హృదయ మధ్యం నుంచి ఉబికి వస్తున్న ఆవేదన. మన ప్రాంతాలలో పాటంటే అందరికీ తెలుసును. అంతో ఇంతో అందరం పాడుతాం. అంతకంటె అధికంగా ఏం గం. మన పాటకి రాగ చైతన్యం కాస్త, స్వర చైతన్యం కాస్త. — అంతేగాని భావ చైతన్యం తక్కువే అని చెప్పాలి. ఠాకూరు గారు పాడుతూ వుంటే ప్రతి మాటకీ, ప్రతి అక్షరానికీ ఏదో జీవం వచ్చినట్టు, అది అమాంతంగా పాటలోంచి లేచి వచ్చి మా హృదయ ఫలకాలమీద నృత్యం చేస్తున్నట్టు మా కనిపించింది! వారి ముఖం చూస్తే, వా రేవో దివ్య సీమలలో విహరిస్తున్నట్టే కనబడ్డారు. ఏవో దివ్యానుభూతులను తిలకిస్తున్నట్టే వారినేత్రాలు కనబడ్డవి. ఆత్యావేశంగా గొంతెత్తి రెండు చేతులూ ఆకాశం వేపు చూపుతూ, నిరాశగా గొంతు కదింపుతూ ఏకాంతంగా ఏదో చెప్పుకుంటున్నట్టు మెల్లని గొంతుకతో, దుఃఖ భారంతో గద్గదమైపోయిన గాత్రంతో, దుర్భరమైన బాధతో కంపిస్తున్న గాత్రంతోనూ వారు పాడుకొంటూ పోయారు. సముద్ర కెరటాల వలె పొర్లుకు వస్తున్న ఇన్ని భావాలు భరించలేక నా కనేకసార్లు కళ్ల నిండా నీళ్లువచ్చినవి. శాస్త్రిగారు మెల్లగా "ధన్యోస్మి, ధన్యోస్మి! విన్నావుటోయ్ ఠాకూరుగారి పాట?" అన్నారు నాతో.

ప్రొఫెసరుగారూ వారి సతీమణి వరేసరి, ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. "ఈ దినం మా జీవితంలో 'రెడ్ లెటర్ డే' ఈ మధురాతి మధుర స్మృతులు మా దేశానికి గొంపోవుతున్నాం" అన్నా రిద్దరూ ఏక కంఠంతో.

దినం విడిచి దినం రెండు, రెండున్నర గంటల కాలం ప్రోగ్రాములు వాయించవలసి వచ్చేది శాస్త్రిగారికి. ఆ రోజులలో ఇప్పుడు వ్యాప్తిలో ఉన్నన్ని కృతులు వ్యాప్తిలో లేవు. ఉన్నా, అన్నీ కేవలం భావ ప్రకటనే ప్రాముఖ్యంగా వాయించుటకు గాని, విచిత్ర స్వర సమ్మేళనంతో కల్పనచేసి (వీణపై) ప్రదర్శించుటకు గాని పనికిరావు గదా! ఒకే కీర్తన ఒక్కొక్కమారు ఒక్కొక్క విచిత్ర రీతిని వాయించేవారాయన. ఉదాహరణగా 'గిరిరాజ సుతా', 'శరశర సమరైక', 'రఘువంశ సుధాం', 'ఎంత వేడుకొందు', 'నిను వినా నామ దెందు', 'ఆనంద సాగరమీదని' వంటి చాలా కీర్తనలు నాలుగైదు విధాలుగా వాయించేవారు. ఏది వాయించినా, రక్తినీ, భావమునూ గాలికి విడిచిపెట్టే లక్షణం మాత్రం ప్రదర్శించే స్వభావం కాదాయనది. ఇదికాక, అన్ని కీర్తనలూ ఠాకూరుగారి వంటి పరిపూర్ణ రసజ్ఞుల సముఖంలో ప్రదర్శించుటకు వీలుండేది కాదాయనకు. వీణ వాయిస్తూనే ఆయన తరుచుగా అప్పటి కప్పుడూ కొత్త ట్యూను వూహచేసి, మంచి రక్తిగా వాయించేసేవారు. జావళులవంటి మామూలు పాత పాటలే అపురూపమైన కొత్త రూపంలో, విలక్షణమైన బ్యాక్‌గ్రౌండు ఇచ్చి వాయించి బేసని పించుకొనే వారు. ఒకమారు శాస్త్రిగారు, మన మందరమూ ఎరిగిన జావళి 'ఇంతిరో వాని మన సెంత చిన్నబోయెనే'అన్నది వాయిస్తూ ఉండగా ఠాకూరుగారు "ఏమి పాట అది? ఎంతో బాగుంది!" అని ప్రశ్నించారు. నే నిది శాస్త్రిగారితో చెపుతూ, "ఏం చెప్పమంటారు? ప్రేమ గీతం (లౌ సాంగు) అని చెప్పమంటారా?" అని అడిగాను. "కొంప తీశావ్! అలా మాత్రం అనకు. కృష్ణ లీలలు అని చెప్పు" అని ఆజ్ఞాపించారు. నే నట్లే టాకూరుగారితో చెప్పేసరికి వారు చాలా సంతోషిస్తూ "ఆహా మీ ప్రాంతం కృష్ణలీల పాటలు ఎంత అందంగా, ఉత్సాహకరంగా ఉన్నవి!" అన్నారు.

ఇదే బాణీలో శాస్త్రిగారు 'నీ నామమే ఎంతో రుచిరా' అన్న ఆదిపూడి సోమనాధరావు గారి పాట అద్భుతంగా గతులు మార్చుతూ వాయిస్తూ వుండగా టాకూరుగారి మనుమరాలు, రెండు, మూడు ఏళ్ల మధ్య వయస్సు గల కసిగందు దిగ్గున లేచి, హాలు మధ్యగా వచ్చి ఆవేశంతో నృత్యం చెయ్యడం ఆరంభించింది. అందరమూ ఆశ్చర్యంగా ముచ్చటపడుతూ చూస్తున్నాం. అందరికన్నా టాకూరుగారే అధికంగా ముచ్చటపడ్డారు! వారు శాస్త్రిగారిని అలాగే, ఆ ట్యూనే విడవకుండా వాయించమని చేతో సంజ్ఞ చేశారు. దరిదాపు 15, 20 నిమిషాల వరకూ శాస్త్రిగారు ఆ ట్యూనే చిత్రవిచిత్ర గతులలో వాయించారు. అంతసేపూ ఆ పసికూన అలాగే అడుగులు వేస్తూ గతి తప్పకుండా డ్యాన్సు చేసింది. చివరకు బాగా అలసిపోయిన ఆ బాలికను తల్లి ఎత్తుకొని యథాస్థానంలోకి తీసుకొని పోయింది.

మేము రెండవసారి వెళ్లినపుడు శాంతినికేతనంలో ఒక నాటక ప్రదర్శనానికి రిహార్సల్సు జరుగుతున్నవి. నాటకం వసంతపూజ, వసంతోత్సవమో జ్ఞాపకం లేదుగాని, ఏదో వసంతోత్సవ సంబంధమైనది. మట్టుకు నిజం కథ నాయకుడు ఒక ఋషి. ఋషి అడవిలో తపస్సు చేసుకుంటూ వుండగా వసంత ఋతువు ప్రారంభ మౌతుంది. వనంలో ఉన్న ప్రతి చెట్టూ, లతానికుంజమూ తన పుష్ప గుచ్ఛమునో, లేజిగుళ్లతో నిండిన కొమ్మనో కానుక తెచ్చి తపో నిమగ్నుడైన ఋషి పాదాలవద్ద వుంచుతుంది. ఋషి పాత్ర ఠాకూరుగారే ధరించారు. నాటకం వారు వ్రాసినదే. వారు పాడవలసిన పాటలు అనేకం ఉన్నవి. వారి పాటకు శ్రీ శాస్త్రిగారి వీణ, దినేంద్రనాథ ఠాకూరు గారి (దీనబాబు) ఇస్రాజ్ పక్క వాద్యాలు. మేము శాంతినికేతనం వెళ్ళిన వెంటనే ప్రతి రాత్రి 9 గం. తరువాత శాస్త్రిగారు వీణ పట్టించుకొని నాటకశాలకు వెళ్లుతూ వుండేవారు. నేను మాత్రం మా బసలోనే వుండిపోయే వాడిని. ఠాకూరుగారి పాటలలో ఒకటి రెండు ముక్కలు కూడా జ్ఞాపకం వున్నవి.

'అమితారీకు దేబేదాయ్', 'అమికశిరిగొచ్చొ' ఇలా మందిరంలో వీణ పాట మాత్రం దినం విడిచి దినం సాయంత్రం 6—8 గంటలకు వుండేది. అట్టి సాయంకాల ప్రోగ్రాములలో ఒకనాడు శాస్త్రిగారు కళ్యాణి రాగం అద్భుతంగా ప్రస్తరించి, వివిధ గతులలో మిశ్రమ తానం ఎత్తుకొని, ఆ తానమే అరగంటసేపు విడవకుండ వాయించారు. నేను వారి కుడిచేతివేపే ఆశ్చర్యంగా చూస్తున్నాను. వారు తానం వాయిస్తున్నంతసేపు వారి కుడిచేతి వ్రేళ్లు పొంగిపోయి, ఆ చెయ్యి బోద చెయ్యిలాగే కనబడ్డది! ఆ రాగమూ, ఆ తానమూ ఠాకూరుగారిని ఎంతో కదిలించివేసి వుండాలి. రిహార్సలుకు వెళ్లి శాస్త్రిగారు తిరిగి వస్తూ, నాతో ఇలా గన్నారు : "నేను సాయంత్రం వాయించిన కళ్యాణి, తానమూ ఠాకూరుగారికి ఎంత నచ్చిన వోయ్! నేను నాటకశాలకి వెళ్లేసరికి ఠాకూరుగారు నేను వాయించిన రాగం విసుర్లు అనుకరిస్తూ, నేను వాయించిన తాన గతులలో డాన్సు చేస్తున్నారు! నాకు చాలా అద్భుతంగా తోచింది సుమా! నాకు తోచినట్టు నే నేదో వాయించేస్తే, సాక్షాత్తూ అవతార పురుషుడూ విశ్వకవీ అయిన ఠాకూరుగారే నా వాద్యానికి ఇంత సమ్మోహితు లవుతారా అని నమ్మలేకుండా వున్నాను!"

అమాయికులు శాస్త్రిగారు. మామూలు వేళలలో వారు తాపీగా, దరహాస వదనంతో, ఛలోక్తులు విసురుతూ, హాస్యం చిందిస్తూ మాట్లాడుతారు. వీణ చేతులో ఉన్నప్పుడు మాత్రం వారు పూర్తిగా మారిపోతారు. ఆ సమయంలో వారు కేవలం సరస్వతీ అవతారమే. తన్మయత్వం పొందుతూ ఆవేశంతోనే వీణాగానం చేస్తారు. వీణకు ధూప దీప నైవేద్యాలతో నిత్య పూజ చేస్తారు. ప్రతి శుక్రవారం వీణను దేవతా పీఠంలో వుంచి, ఫిడేలు వాయిస్తూ, పాడుతూ భజన చేస్తారు. నిత్య పూజలో వారు వీణకు సాష్టాంగ నమస్కారం చేస్తూ, రెండు చేతులూ జోడించి, "అమ్మా! జననీ!" అనగానే వారి గొంతుక వణకిపోయి గద్గదమైపోతుంది. కన్నీరు బొటబొట కారుతుంది! వీణనే సాక్షాత్తూ సరస్వతీ దేవి అవతారమే అని నమ్మిన మరో వైణికుడిని నే నింతవరకూ చూడలేదు.

నాటక ప్రదర్శనం రోజున కలకత్తానుంచి చాలామంది పెద్దవారు వచ్చారు. ప్రేక్షకులతో హాలంతా కిటకిట లాడిపోయింది. బెంచీలుగాని, కుర్చీలుగాని లేవు. అందరూ నేలమీద కూర్చోవలసిందే! లైటింగుకు కలకత్తానుంచి డైనమో తెప్పించి విద్యుద్దీపా లేర్పాటు చేశారు. ఈ ప్రదర్శనం గురించి ఆనాటి మోడర్న్ రివ్యూ మాస పత్రికలో ప్రచురింపబడ్డట్టు జ్ఞాపకం. ఠాకూరుగారు పాడుతూ, సంగమేశ్వర శాస్త్రిగారు వీణ పక్క వాద్యం వాయిస్తూ ఉంటే విన్నవారికి వేర్వేరు మందం గల తీగెలు కట్టిన రెండు వీణలు కలిసి గానం చేస్తున్నట్టే తోచింది. ప్రదర్శనం మధ్యలో ఛటాలున డైనమో పాడైపోయి, కొద్ది నిముషాలు నిల్చిపోయింది. హాలంతా గాఢాంధకారమైపోయింది. అయినా ఠాకూరుగారు పాట మానలేదు, శాస్త్రిగారు అనుకరించడమూ మానలేదు. ఆ గాఢాంధకారంలో ఒక్కదానిపై వీణ (గాత్రం), ఒక మానుషీ వీణ (వీణ) అమృత తుల్యమైన అమర గానం అందిస్తున్న ఆ మధుర క్షణాలు నా స్మృతిపథంలో మరపు రానివిగా ఇప్పటికీ చెవులలో గింగురు మంటూనే వున్నవి.

తరువాత లైట్లు వచ్చి, నాటకం పూర్తి అయింది.

1958 ఏప్రిల్ 24 వ తేదీన శ్రీ కమిషన్ శిక్షణ ప్రారంభించిన 261 మంది సహాయ సైనిక విద్యార్థి దళం పురుష ఉద్యోగులు, 49 మంది స్త్రీ ఉద్యోగులు మే 14 వ తేదీన శిక్షణ పూర్తిచేశారు. ఈ సందర్భంలో గిండీ ఇంజినీరింగ్ కళాశాలలో సైనిక విన్యాసం జరిగింది.